# జీవితమింతేనా?

రచన :
శ్రీ వణలం లక్ష్మీపతిరావు.

'నాన్నా నీవు రోజూ ఇంటికి రావటంలేదు - ఇవాలెక్కడికీ వెళ్లకుండా వస్తావుకదూ! ఇవాళ పాపాయిని నన్ను అమ్మను సినిమాకు తీసికెళ్లరూ నేనింతవరకు సినిమా చూడలేదు నాన్నా!' అంటూ ముద్దులొలుకు మాటలతో తండ్రి ఒళ్ళో చేరాడు చిట్టిబాబు.

అలా బాబు తన ఒళ్లో చేరటం సుతరామూ ఇష్టంలేని తండ్రి 'శేషగిరి' చీదరించుకున్నాడు. అంతేకాదు తన్ని తరిమాడు. దెబ్బలుతిన్న బాబు ఏడ్పుచూసి పాప కెవ్వుమంది వారిరువురి దుఃఖాన్ని చూచిన తల్లి కళ్ల వెంట అశ్రువులు ధారలా ప్రవహించాయ్ శేషగిరి వారిని ఏవగించుకుంటూ గుమ్మందాటి బయటపడ్డాడు.

♦ ♦ ♦

ప్రతిమనిషికీ అనేక కోరికలుంటాయ్. అవి ఏనాటికైనా తీరవా అనే ఆశతో వుంటుంది, ప్రతివారి మనసు ఆ ఆశే మానవుని జీవింపజేస్తుందనటం సందేహాస్పదమా? అది ఎన్నటికీ సందేహాస్పదంకాదు. అదొక కటికసత్యం. ఆ సత్యవాక్కుకు తిరుగులేదు. కానీ ఆకాశం వరకూ వేసిన ఆశలు అక్కడే ఆగిపోతే! భూమికి సాధారణంగావుండే ఆకర్షణశక్తి నన్ను




ఎల్లప్పుడు
మధురై
సుందర్
హాండ్‌లూమ్స్
వాడండి.

* *

మేలైన
గ్యారంటీరంగు.

* దుప్పట్లు
* నాప్‌కిన్స్
* తువ్వాళ్లు
* కాన్వాస్ క్లాత్

మొదలైనవి

ప్రొప్రయిటర్: ఆర్. ఎమ్. రామాచారి

గిల్లిందన్నమాట. అంటే భగవంతునిశక్తి సన్నగిల్లిందనే నా ఊహ! అంతమాత్రమున నేను నాస్తికుడనని చెప్పలేను.

మనం సంసారసాగరంలో విజయులమౌతాం తన భర్త మనసు ఎప్పటికైనా మారకపోదుగా అనే అందరికీవుండే ఆశతో కష్టాలన్నిటినీ సుఖాలుగా భావించి ఈశ్వరుడు లోకకళ్యాణార్థం విషాన్ని కంఠంలో దాచుకున్న విధంగా 'శాంత'కూడా ఆ కష్టాన్ని గుండెలో గుప్తపరుచుకొంటుంది. అయితే అక్కడ నీలకంఠుడు విషాన్ని విషమనే పదిలపరచాడు, ఈమె వాటిని అంటే, కష్టాల్ని సుఖంగా భావించి తనలో ఇముడ్చుకుంటుంది.

అన్నిరోజులూ ఒక విధంగా నేవుండవు అదేవిధంగా మానవుని హృదయం పాపపుట్టింది మొదలు బోసితాతగా రూపొందువరకూ అతని హృదయం ఒకే విధంగా వుంటుందనటం చాలా పొరపాటు అవివేకమనికూడా నొక్కివక్కాణించగలను. గొంగళిపురుగు తన జీవితంలో ఎన్నిదశలో మారుస్తుంది! మానవునిలోకూడా మార్పులు వస్తుంటాయి. బంగారపు బొమ్మనుచూసిన కళ్ళకు రాతిచెక్కడు అందమనిపించదు.

అదేవిధంగా – శేషగిరి శాంతను ఆమెలోని అందాన్నిచూసిప్రేమించి పెళ్ళిచేసుకున్నవాడే; అప్పట్లో శాంతను కాలుకదపనీయక, ఏమీ కష్టపెట్టకుండా నిండుప్రేమతో చూచినవాడే; ఎంతో ప్రేమానురాగాలతో సంసారాన్ని దినవాడే; కానీ! కర్మవశాత్తు అతని జీవితంలో రెండవదశ ప్రవేశించడంవల్ల ఈ క్రింది కథ జరిగింది. దాని తార్కాణమే శాంత ఇడుములకు మూలం.

◆ ◆ ◆

మందువేసంగి అయినా శేషగిరి ఆఫీసు పని మీద ఊరికెళ్ళవలసివచ్చి రైలెక్కాడు. ఇంకా రైలు కదలటానికి టైముంది. అందువలన శేషగిరి కాలక్షేపంకోసం ఒక పేపరు చదవటంలో నిమగ్నుడయ్యాడు రైలు కదుల్తుంది. ఇంతలో తలుపువద్ద గాజులు గల్లుమన్నాయ్! అంతదాకా పత్రికా పఠనలో నిమగ్నుడై వున్న గిరి తలెత్తిచూసాడు. తను కలకంటున్నాడా! కాని నిజమే. ఎదురుగా మృగాక్షికన్నులతో డబ్బపండు ఛాయలో నిగనిగ లాడుతున్న ఒక యువతి; ఆమెను యువతంటే కుదరదు కోమలి! అందానికి మెఱుగు పెడ్తున్న కోమలత్వం కలిగిన సుకోమలి. ఆమె చేతిలో హేండ్ బ్యాగ్ త్రిప్పుకుంటూ ఎక్కడా చోటుదొరకనట్లు గిరి ప్రక్కకే జేరింది. ఆమె ప్రత్యేకించి అతని ప్రక్కనే కూర్చోటంతో విశేషత లేకపోలేదు. శేషగిరి ఆమె అందానికి ప్రతిరూపమని ఒక మాటతో చెప్తే చాలనుకుంటాను. ఆమె ఆవిధంగా తన ప్రక్కనే కూర్చోవటంవల్ల చూసేవారేమన్నా అనుకుంటారనే చిత్తభ్రమవల్ల ప్రక్కకు జరిగాడు.

'ఏమండీ అలా భయపడతారు. పరవాలేదు ఆ ఇరుకునపడి అవస్తపడక సరిగా ఈ ప్రక్కకు జరిగికూర్చోండి' అన్న ఆమెకంఠం ఖంగుమంది.

పెట్టెలోనివారందరూ ఆమె చనువుకు వారిరువురివంక తెలతెలబోతూ చూడసాగారు. అది గ్రహించిన శేషగిరి నిర్మోహమాటంగా, 'మీకూమాకూపొత్తుకుదరదు. నేను మీవంటి ఆస్థిపరుడుకాను. అగ్నిలో చేయిబెడితే కాలకుండా వుంటుందా? త్రాచుపాము పగబడితే కరవకుండా వుంటుందా? అని ఇంకేమేమో అర్థంలేకుండా ఆవేశంతో మాట్లాడుతున్న

శేషగిరి మాటల కడ్డువచ్చి 'ఏమండీ బీద గొప్పల తారతమ్యం లేకండి. నేను నిరుపేదగా వున్న మీ జీవితదశలో మార్పువచ్చి మీరు ధనవంతులవ్వొచ్చు. కాని! మనమెప్పటికైనా కాలేకపోతామాఅని అవకతవకగా జీవించటం పొరపాటు. చూడండి ఈ పెట్టెలోవున్నవారి మనస్సులన్నీ మీ మనస్సులాగే వుంటాయా! అలాగే అంతా ధనవంతులే వుంటారా! అయితే అంతా అందలమెక్కితే మోసేవారెవ్వరు? అంతా ధనవంతులేవుంటారా! లేక ధనంవుండికూడా ఖర్చుపెట్టని కొంతమంది పోలికనంతా పోలియుంటారనటం హాస్యాస్పదం. అందుకని అంతా ధర్మవంతులని నా ఉద్దేశ్యంకాదు. మానవనిర్మితమైన ఈ రైలులోని పెట్టెలన్నీ బయటికొకేవిధంగా కన్పించినా, నిజంగా అలాలేవు. దీనిలోనే లగేజీపెట్టెలుంటాయ్ దానిలోనే చిన్నపెట్టెలు, పెద్దపెట్టెలు, మగవారివి - ఆడవారి, ఫస్టుక్లాసు - సెకండుక్లాసు - థర్డ్‌క్లాసు అని అనేక భిన్న తరగతులున్నాయ్ దైవనిర్మితమైన మానవ మనుష్యులుకూడా బయటకు ఒకేవిధంగా కనిపించి లోపల అనేక భిన్నవిభాగములున్న రైలులాంటిది ఇకనైనా నన్నర్థం చేసుకుంటే సంతోషిస్తాను.'

ఆమె వాగ్ధాటినీ, సుందర ముఖారవింద స్వరూపాది దివ్య తేజంబుల చూచిన శేషగిరి



ఉండబట్టలేక, మీవంటి మంచివారి పరిచయ భాగ్యం కలిగినందుకు సంతోషం. 'వట్టిశాస్త్రాధ్యయనంవల్లనే కాక – విజ్ఞుల సాహచర్యం వల్లనే మానవుడు విజ్ఞుడౌతాడు' అనే పెద్దల మాటను గుర్తుకు తెచ్చారు. మట్టిలో మాణిక్యం దొరుకుతుంది. బురదలో పద్మం ఉద్భవిస్తుంది. కానీ అది బురదలావుండక సుందరంగా యుంటుంది. ఆ బురదకంతకూ శోభను చేకూరుస్తుంది అనే సంగతి తెలుసుకోలేక పోయాను. జమిందారిణీలగు మీవంటి వనితలకు సహజంగావుండే క్రూరస్వభావం, మీలో కఱుడుకట్టి కాపుర చేస్తుందేమోనని పొరబడ్డాను. 'మీ నామధేయం' ఆ వాగ్ధాటిలో త్వరితంగా వెలువడిందామాట.

తనను అర్థంచేసుకొని మనసిచ్చి మాట్లాడుతున్నందుకు సంతోషించిన ఆమె అప్రయత్నంగానే 'ఉమాదేవి' అంటారు. అని త్రాచుపాములా మీద కుదుకుతున్న జడను ప్రక్కకు తోసింది. 'మీకభ్యంతరం లేకపోతే మా వూరు దగ్గరలోనేవుంది మా ఆతిథ్యం స్వీకరించరూ!' అంది ఉమ. ఆమె కళ్లల్లోనిభావాల్ని లోతుకుదిగి చూస్తున్న గిరి ఆశ్చర్యపడ్డాడు; అంతేకాదు సంతోషించాడనే చెప్పాలి.

♦ ♦ ♦

ఉమకు తండ్రి లేకపోవటంతో తల్లే పెంచింది. వాళ్ళనాన్న సంపాదించిన ఆస్తి తలమునకలుగావుంది. ఆమెమాట నింట్లో కాదనే వారులేరు. శేషగిరి ప్రతి ఆదివారం ఉమ యింటికివచ్చి ఆరాత్రి ఆమెయింట్లో గడుపుతుండేవాడు. ఇలా ఆమెకు శేషగిరిమీద మక్కువ కలుగటంతో అతన్ని ఆఫీసు మాన్పించి తనయింట్లోనే వుంచుకుంది. ఆమెను కాదనేవారులేరు. లోకం వేలుపెట్టిచూపడానికామె జమిందారిణి. ప్రేమధనమైకంలో పొర్లాడుతున్న శేషగిరి, భార్యా పిల్లలనే మరచాడు.

డబ్బు పుష్కలంగా దొరకటంతో త్రాగుడుకూ, రేసులకూ అలవాటుపడ్డాడు. ఒకసారి పిల్లలకోసమైనా రావలసినదని శాంత ఎన్నో ఉత్తరములు వ్రాయగా దైవప్రోద్బలంవల్లనో హృదయప్రోద్బలంవల్లనో ఇంటికి వచ్చాడు. ఆవచ్చిననాడే చిట్టిబాబును, పాపను, శాంతను కన్నీటిలోముంచి ఉమను చేరుకున్నాడు. త్రాగుడు వద్దని మందలించిన ఉమను ఆ మైకంలో తెగబాదాడు. ఆమె గోల్లుమంటూ దుఃఖించ నారంభించింది. అదిచూచి గిరి గట్టిగా ఉన్మాదిలా నవ్వసాగాడు, అంతలో ఒకదగ్గు తెరవచ్చింది. ఆ తెర అతణ్ని తెర వెనక్కు లాక్కుపోయింది. అతని జీవిత నాటకం సమాప్తమయ్యింది. అంతే అతని ఆత్మ పరమాత్మను కలిసింది. గిరి చావు తెలిసిన శాంత ఆశలు ఆకాశంలో నిలబడి వెక్కిరించసాగాయ్! సహించలేని శాంత ఆత్మహత్య చేసుకోబోయింది. పిల్లలు జ్ఞాపకమొచ్చారు. అంతటితో ఆమె పిల్లలను కౌగలించుకొని బావురుమంది. తల్లిబాధను గ్రహించిన పిల్లలు ఆమెకు వంతపాడారు. భర్తలేని జీవితమింకెందుకు, స్త్రీ జీవితమింతేనా?

మనసారా ప్రేమించి ప్రేమవలపులో ఆయనకు భార్యా పిల్లలూ వున్నారు. వాళ్ళకూ ఆశలుంటాయనే సత్యాన్ని తెలుసుకోలేక దరికి జేర్చి తిరిగి–ఎడబాటుకు గురియైన ఉమ ఇక నలుగురిలో తలెత్తుకొని తిరుగలేక భ్రూణహత్యాపాతకానికికూడా జంకక గిరిని చేరుకుంది.